సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం, 24, మే, 2024



టన్ను చీనీ రూ.38 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38 వేలు, కనిష్టం రూ.12 వేల ప్రకారం ధర పలికాయి.



మల్లె పూజోత్సవం
కదిరి లక్ష్మీనరసింహస్వామి మల్లె పూజోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మద్దిలేరు ఒడ్డునున్న మల్లెపూల మంటపం వద్ద స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
38.6°/23.3°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కొన్ని మండలాల్లో తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ. వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఎస్పీ మాధవరెడ్డి



పుట్టపర్తి టౌన్: ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. కౌంటింగ్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలు, కాలనీలు గుర్తించి భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. పోలీసులు రోజూ కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆయా గ్రామాల్లో పాత నేరస్తులు, రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు చేస్తున్నామన్నారు. తనిఖీల్లో భాగంగా పరిగి మండలం బీచ్‌గానిపల్లిలో ఆర్‌సీ లేని ఆరు ద్విచక్ర వాహనాలు, ఐదు వేటకొడవళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రజలు ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

బీసీజీ వ్యాక్సినేషన్ వందశాతం పూర్తి చేయాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

పుట్టపర్తి అర్బన్: బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓ మంజువాణి ఆదేశించారు. గురువారం పుట్టపర్తి మండలంలోని వెంగళమ్మచెరువు పీహెచ్‌సీ, కంబాలపర్తిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. మొదట వెంగళమ్మచెరువు పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ గది, ఫార్మసీ, ల్యాబొరేటరీ, కాన్పుల గది, వార్డులను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజునాయక్, డీఏఎల్‌టీ అధికారి డాక్టర్ తిప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నృసింహుని హుండీ ఆదాయం రూ.71 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం హుండీ కానుకలను లెక్కించారు. రూ.71,70,337 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొత్తం 50 రోజులకుగాను ఈ ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. శుక్రవారం కూడా హుండీ లెక్కింపు కొనసాగుతుందన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి రమేష్‌బాబు, ఎస్‌బీఐ మేనేజర్ రాఘవేంద్రతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పెయిన్ కిల్లర్స్



తల నొప్పి మొదలు కీళ్ల నొప్పుల వరకూ ఉపశమనం కోసం ఎక్కువ మంది పెయిన్ కిల్లర్స్ మీదే ఆధారపడుతూ ఉంటారు. ఒక్క మాత్రతో నొప్పిని మాయం చేసేసి, తిరిగి పనిలో పడిపోవడం చాలా మంది అలవాటు చేసుకున్నారు. అయితే ఇవి ఆరోగ్యానికి ఎంతో చేటు చేస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీలను దెబ్బతీయడమే కాకుండా గుండెపైనా ప్రభావం చూపిస్తాయని చెబుతున్నారు.



హిందూపురం జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ రోగులు (ఫైల్)

- ఏ నొప్పికైనా ఎడాపెడా పెయిన్ కిల్లర్స్ వాడుతున్న జనం
- పెరుగుతున్న కిడ్నీ బాధితుల సంఖ్య
- జిల్లాలో 253 మంది డయాలసిస్ రోగులు
- క్రమం తప్పకుండా నీళ్లు తాగాలంటున్న వైద్యులు

సాక్షి, పుట్టపర్తి: సంతోషంగా బతకాలంటే మన శరీరంలోని అన్ని భాగాలు ఆరోగ్యవంతంగా ఉండాలి. శరీరంలో ఏ ఒక్క భాగానికి సమస్య వచ్చినా అది మనిషి జీవన విధానాన్ని మార్చేస్తుంది. అందరితో పాటు సంతోషంగా బతకాలని ఉన్నా.. కొందరిని మూత్రపిండాల వ్యాధి వెంటాడుతోంది. ముఖ్యంగా అతిగా పెయిన్ కిల్లర్స్ వినియోగించడం.. డాక్టర్ల సలహాలు లేకుండా సొంత వైద్యంపై ఆధారపడటం తదితర కారణాలతో చాలా మంది కిడ్నీ రోగాల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. రెండు – మూడు రోజులకోసారి డయాలసిస్ చేయించుకుంటేనే ప్రాణాలతో నిలిచే పరిస్థితిలో వందల మంది ఉన్నారు. జిల్లాలో రోజుకు సుమారు 70 మంది రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. హిందూపురం, కదిరి ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డయాలసిస్ కేంద్రాల్లో రోజుకు సగటున 70 – 80 మంది డయాలసిస్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. మూత్రపిండాల సమస్యలను వైద్యులు తీవ్రంగా పరిగణిస్తారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న ప్రాణానికే ప్రమాదమని కూడా హెచ్చరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నా..

వైద్య – ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కిడ్నీ సంబంధిత వ్యాధుల గురించి నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. పల్లె, పట్టణాల్లో అక్కడక్కడా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి కిడ్నీ రోగాలతో వచ్చే ప్రమాదం గురించి ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. డయాలసిస్ కేంద్రాల వద్ద నోటీసు బోర్డు రూపంలో ప్రచారం చేస్తున్నారు. అయినా కిడ్నీ రోగాల బారిన పడే వారి సంఖ్య మాత్రం నియంత్రణలో రాలేదు. ప్రతి ఏటా రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. అవగాహన లోపంతోనే చాలా మంది కిడ్నీ రోగాల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

గుండెపై కూడా ప్రభావం..

కొందరు తక్షణమే నొప్పి తగ్గేందుకు పెయిన్ కిల్లర్స్ మందులను పొడి రూపంలో తీసుకోవడం లేదా ఇంజెక్షన్ రూపంలో తీసుకోవడం చేస్తారు. కానీ ఇలా చేయడం వల్ల ఔషధం నేరుగా రక్త ప్రవాహంలోకి ప్రవేశిస్తుంది. ఇది గుండెపై ప్రభావం కూడా చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాలికంగా ఇలా పెయిన్ కిల్లర్స్ వాడడం వల్ల తీవ్రమైన హృదయ సంబంధ సమస్యలు, గుండెపోటు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

కారణాలు ఇవే..

- గ్రామాల్లో కలుషిత నీటిని తాగడం కారణంగానూ కిడ్నీలు పాడైపోతున్నాయి. వడబోసిన నీరు లేదా శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.
- చాలామంది అవగాహన లేకుండా ఎడాపెడా పెయిన్ కిల్లర్స్ మాత్రలు వాడుతున్నారు. ఫలితంగా కిడ్నీ రోగాల బారిన పడుతున్నారు.
- రోజులో వ్యక్తి కనీసం ఐదు లీటర్ల నీటిని తాగితే కిడ్నీ రోగాలకు దూరంగా ఉండవచ్చు. డయాలసిస్ బారిన పడిన వారిలో చాలామంది 2 – 3 లీటర్ల నీటిని మాత్రమే తీసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

జాగ్రత్తలు అవసరం



మూత్రపిండాల వ్యాధి బారిన పడటానికి అనేక కారణాలు ఉన్నాయి. స్వచ్ఛమైన నీటిని తాగకపోవడం, మోతాదుకు మించి పెయిన్ కిల్లర్స్ వాడటం, శరీరానికి సరిపడా నీళ్లు తీసుకోకపోవడంతో కిడ్నీలు దెబ్బ తింటున్నాయి. ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. డాక్టర్లను సంప్రదించకుండా ఎలాంటి మందులు (ఔషధాలు) వాడకూడదు.

– మంజువాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

జిల్లాలో 253 మంది బాధితులు..



జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం 253 మంది డయాలసిస్ రోగులు ఉన్నారు. వీరందరూ ప్రతి రెండు – మూడు రోజులకోసారి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఒక్కో రోగికి రక్తం శుద్ధి చేసి తిరిగి పంపించడానికి సుమారు 4 గంటల సమయం పడుతుంది. పొరుగు రాష్ట్రం కర్ణాటక నుంచి కూడా కొందరు హిందూపురం ఆస్పత్రికి వచ్చి వైద్యం పొందుతున్నారు. కొత్త కేసులను గుర్తించడం.. పాత రోగులు క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకునేలా వైద్య సిబ్బంది ఫాలోఅప్ చేస్తుంటారు. వ్యాధి తీవ్రత ఆధారంగా వారంలో రెండు – మూడుసార్లు డయాలసిస్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డయాలసిస్ రోగులకు ప్రతి నెలా రూ.10 వేల చొప్పున వైద్య ఖర్చులకు ఇస్తున్న విషయం అందరికీ తెలిసిందే.

నేటి నుంచి 10వ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

పుట్టపర్తి: 10వ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జరుగుతాయని, ఇందు కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీవీఈఓ రఘునాథరెడ్డి, డీఈఓ మీనాక్షి తెలిపారు. శుక్రవారం నుంచి జూన్ 3వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు, జూన్ 1వ తేదీన ఇంటర్ పరీక్షలు ముగుస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో 7,344 మంది 10వ తరగతి విద్యార్థులు, 6,809 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 692 మంది ఉన్నారన్నారు. అలాగే ఇంటర్ రెండో సంవత్సరానికి సంబంధించి 2,590 మంది, ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 370 మంది మొత్తం 10,461 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షలకు 29 కేంద్రాలు, ఇంటర్ పరీక్షల కోసం 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

రేపు పుట్టపర్తిలో డీఈఓ పరీక్ష

పుట్టపర్తి అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఈఓ ఇన్ ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఈనెల 25న పుట్టపర్తిలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 7.30 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఉదయం 8.30 గంటల తరువాత అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాన్ని బీడుపల్లి సమీపంలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి: జిల్లాలోని ఉన్న కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట, కనగానిపల్లి గురుకులాల్లో గ్రూపుల్లో కూడా మార్పు చేశామన్నారు. నల్లచెరువులో ఎంఈసీకి బదులు ఎంపీసీ, తనకల్లులో ఎంఈసీకి బదులు బైపీసీ, గాండ్లపెంటలో ఎంఈసీకి బదులు ఎంపీసీ, కనగానపల్లిలో ఎంఈసీకి బదులు ఎంపీసీ గ్రూపులను ప్రవేశపెట్టామన్నారు.

కల్తీ కల్లు విక్రయిస్తే పీడీ యాక్ట్

- పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా

మడకశిర: నియోజకవర్గంలో కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా హెచ్చరించారు. ఆయన గురువారం పోలీస్ సర్కిల్ ఆఫీస్‌లో నియోజకవర్గంలోని కల్లు అంగళ్ల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కల్తీ కల్లును అమ్మకూడదని హెచ్చరించారు. కల్తీ కల్లు అమ్మి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కల్తీ కల్లు అమ్మే వారిపై పీడీ యాక్ట్, ఎక్సైజ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని చెప్పారు. నియోజకవర్గంలో సీఐలు, ఎస్‌ఐలు కల్లు దుకాణాలను తనిఖీ చేసి నివేదికలు పంపాలని ఆదేశించారు. కల్తీ కల్లు అమ్మితే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో అర్బన్, రూరల్ సీఐలు మనోహర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్..

పట్టణంలోని చౌటుపల్లిలో అక్రమంగా కల్లు విక్రయిస్తున్న శంకరప్ప అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎస్‌ఐ పృథ్వీ తెలిపారు. కల్లును కూడా సీజ్ చేశామన్నారు. కల్లు శాంపిల్స్ తీసి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

చీపులేటి ఘటనపై విచారణ..

పట్టణంలోని చీపులేటిలో కల్తీకల్లు తాగి క్రిష్టప్ప అనే వ్యక్తి మృతి చెందినట్లు జరుగుతున్న ప్రచారంపై కూడా విచారణ జరుపుతున్నట్లు సెబ్ ఎస్‌ఐ పృథ్వీ తెలిపారు. ఈ ఘటన గత నెల 6న జరిగిందన్నారు. ఆ రోజు కల్తీ కల్లు తాగినవారందరూ అస్వస్థతకు గురై అవకాశం ఉంటుందని, అయితే క్రిష్టప్ప ఒకడే కల్తీ కల్లు తాగి మృతి చెందడానికి అవకాశం లేదన్నారు.



మడకశిరలో కల్లు అంగళ్ల నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న బాజీజాన్ సైదా

కల్తీ కల్లుకు ఒకరి బలి?

మడకశిర: పట్టణంలోని చీపులేటిలో కల్తీ కల్లుకు ఒకరు బలైనట్లు తెలిసింది. క్రిష్టప్ప అనే వ్యక్తి కల్తీకల్లు తాగి మృతి చెందినట్లు సమాచారం. ఈఘటన జరిగి దాదాపు నెల రోజులు కావస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. అయితే ఈ ఘటన తమ దృష్టికి రాలేదని స్థానిక సెబ్ సీఐ ధీరజ్‌రెడ్డి తెలిపారు.

‘కౌంటింగ్’కు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 టేబుళ్లు
- కౌంటింగ్ ప్రక్రియకు 119 మంది మైక్రో అబ్జర్వర్ల నియామకం
- 460 మంది సివిల్ పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో బందోబస్తు
- 24వ తేదీ, జూన్ 1వ తేదీన సిబ్బందికి కౌంటింగ్‌పై శిక్షణ



బిట్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనాకు తెలియజేశారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టర్ బంగ్లాలో వీసీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపడుతున్నామన్నారు. జిల్లాలోని ధర్మవరం, పుట్టపర్తి అసెంబ్లీ, హిందూపురం పార్లమెంట్ నియోజక వర్గాల ఓట్ల లెక్కింపును లేపాక్షి సమీపంలోని గురుకుల పాఠశాలలో చేపట్టనున్నారు. అలాగే పెనుకొండ, కదిరి, హిందూపురం, మడకశిర అసెంబ్లీలతో పాటు హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో, రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి అనంతపురంలోని జేఎన్‌టీయూ కళాశాలలో కౌంటింగ్ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు.

మూడంచెల భద్రత

ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ల ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గానికి 18 రౌండ్లు, మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజక వర్గాలకు 19 రౌండ్లు, రాప్తాడు, ధర్మవరం, కదిరి 21 రౌంట్లు చొప్పున లెక్కించనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ సిబ్బందికి ఈనెల 24, జూన్ 1వ తేదీన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26, జూన్ 2వ తేదీన రెండు దఫాలుగా ర్యాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. 119 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలియజేశారు. కౌంటింగ్ రోజు, అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రతా ప్రమాణాలు పాటిస్తామన్నారు.

కట్టుదిట్టంగా బందోబస్తు

నిర్ణీత సమయంలోగా ఎన్నికల ఫలితాలు వెల్లడించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలియజేశారు. కేంద్ర బలగాలతో పాటు సుమారు 460 మంది సివిల్ పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల వద్ద 160 సీసీ కెమెరాలు అమర్చి మానిటరింగ్ చేస్తున్నామని వెల్లడించారు. ఒక్కో టేబుల్‌కు ఒక సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్, అటెండర్‌ను నియమించామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రెండు హాళ్లను సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో 1852 పోలింగ్ కేంద్రాల్లో 14,03,259 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ కొండయ్య పాల్గొన్నారు.

వేడుకగా బుద్ధ పౌర్ణమి





బాల బుద్ధునికి అభిషేకం చేస్తున్న దృశ్యం, నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న బౌద్ధ సన్యాసులు



కేంద్ర మంత్రి భగవత్ కిషన్‌రావుకు సత్యసాయి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆర్‌జే.రత్నాకర్‌రాజు



భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో గురువారం బుద్ధ పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. సత్యసాయి మహా సమాధిని బౌద్ధ సంస్కృతీ, సంప్రదాయాల ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. ఉదయం సత్యసాయి మహా సమాధి చెంత బౌద్ధులు వేద పఠనం నిర్వహించారు. వివిధ దేశాలకు చెందిన వేలాది భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. హిమాచల్‌ప్రదేశ్, నేపాల్‌కు చెందిన 30 మంది బౌద్ధ సన్యాసులు బుద్ధ పౌర్ణమి సంప్రదాయమైన నార్సింగ్ ఘాత్‌ను ఆలపించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు జ్యోతి ప్రజ్వలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. గ్లోబల్ బుద్ధ పౌర్ణమి వేడుకల కోర్డినేటర్ వాస్‌దేవ్ ఖిలానీ బుద్ధ పౌర్ణమి వేడుకల ముఖ్య ఉద్దేశం వివరించారు. కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి భగవత్ కిషన్‌రావు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. సాయంత్రం బౌద్ధ సన్యాసులు వారి సంస్కృతీ, సంప్రదాయాలను వివరిస్తూ చక్కటి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

వైభవంగా సంగమేశ్వరుడి రథోత్సవం



సంగమేశ్వరుడి రథాన్ని లాగుతున్న భక్తులు

కొత్తచెరువు: మండల కేంద్రంలోని పార్వతి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సంగమేశ్వరుడి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శివనామ స్మరణతో కొత్తచెరువు పుర వీధులు మార్మోగాయి. ఉదయం నుంచే స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11 గంటలకు పార్వతీ సమేత సంగమేశ్వరుడి విగ్రహాలను రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల తర్వాత రథాన్ని లాగారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు దాతలు పెద్ద ఎత్తున ప్రసాదం, అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాజరమేష్, బుక్కపట్నం ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

వాహనం ఢీ... యువకుడి మృతి


చంద్రమోహన్ (ఫైల్)

ఆత్మకూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... ఆత్మకూరు మండలం తలుపూరుకు చెందిన చంద్రమోహన్ (28)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాలుగేళ్లుగా గుంతకల్లులో వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేసే పనితో జీవనం సాగిస్తున్న ఆయన ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం రాత్రి ఆత్మకూరులో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తలుపూరుకు బయలుదేరాడు. వడ్డుపల్లి అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి టోల్‌ప్లాజా వద్ద ఉన్న అంబులెన్స్ ద్వారా క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టపాసులు సీజ్


టపాసులు నిల్వలను పరిశీలిస్తున్న సిఐ కొండారెడ్డి

పుట్టపర్తి టౌన్: ఎనుములపల్లిలో అక్రమంగా నిలువ ఉంచిన రూ.45 వేల విలువ చేసే టపాసులు గురువారం పోలీసులు చేశారు. ఎనుములపల్లి సమీపంలోని శిల్పారామం వెనుకభాగంలో గోవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి వ్యవసాయ గోదాములో అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో తనిఖీ చేపట్టారు. రూ.45 వేల విలువ చేసే టపాసులు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు.

చిటుకలో ముంచుకొచ్చే ముప్పు

- జీవాలకు వ్యాధి సోకితే క్షణాల్లోనే మృత్యువాత
- వ్యాధి ప్రబలకుండా పశుసంవర్ధక శాఖ ముందస్తు చర్యలు
- చిటుక వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్‌కు సిద్ధం
- అందుబాటులో 1.13,900 డోస్‌ల వ్యాక్సిన్



లేపాక్షి: గొర్రెల్లో వచ్చే వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైంది 'చిటుక వ్యాధి'. ఈ వ్యాధికి గురైన గొర్రెలు... చిటుక వేసినంత సమయంలోనే మృత్యువాత పడుతాయి. అందుకే, ఈ మహమ్మారికి 'చిటుక వ్యాధి' అని పేరొచ్చింది. కొన్ని ప్రాంతాల్లో దీనినే 'నెత్తి పిడుగు వ్యాధి' అని కూడా పిలుస్తారు. జీవాల ప్రాణాలు తీసే ఈ వ్యాధిపై గొర్రెల పెంపకందారులకు సరైన అవగాహన ఉండాలని పశుసంవర్ధక శాఖ అధికారులు అంటున్నారు. అప్పుడే, జీవాలు మృత్యువాత పడకుండా ఉంటాయన్నారు.

వ్యాధి కారకాలు ఇవే..

'క్లాస్ట్రీడియం పర్ఫింజన్స్ టైప్-డి' అనే బ్యాక్టీరియా వల్ల గొర్రెల్లో చిటుక వ్యాధి వస్తుంది. ఈ క్రిములు జీవాల పొట్టలో సహజీవనం చేస్తుంటాయి. అయితే తేమతో కూడిన పచ్చగడ్డిని గొర్రెలు తిన్నప్పుడు, ఈ సూక్ష్మక్రిములు ఆ గడ్డిలోని ధాతువులను జీర్ణం చేసుకుని వృద్ధి చెంది క్రమంగా వాటి సంతతిని పెంచుకుంటాయి. ఆ తర్వాత జీవాల పేగుల్లో హానికరమైన 'ఎప్సిలాన్ టాక్సిన్' అనే విష పదార్థాన్ని విడుదల చేయడం మొదలు పెడతాయి. ఇది పేగులు, మూత్రపిండాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. జీవాల్లో 'ఎప్సిలాన్' విషపదార్థం ఎక్కువైతే, అవి వెంటనే చనిపోతాయి.

వ్యాధి లక్షణాలు..

తొలకరి వర్షాల వలన పెరిగిన పచ్చికను జీవాలు అతిగా తినడం వల్ల చిటుక వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అందుకే ఈ సీజన్‌లో గొర్రెలు, మేకలను చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా ఈ వ్యాధిబారిన పడిన జీవాల్లో ఎలాంటి లక్షణాలు బయటికి కనిపించవు. ఎక్కువ సంఖ్యలో జీవాలు ఎలాంటి లక్షణాలు కనిపించకనే చనిపోతాయి. కొన్నిసార్లు చిటుక వ్యాధికి గురైన గొర్రె పిల్లలు చెంగున గాలిలోకి ఎగిరి పడి మరణిస్తాయి. పెద్ద గొర్రెలు తీవ్రమైన అనారోగ్యంతో సరిగ్గా నడవలేకపోతాయి. మేత తినవు. నోటి నుంచి చొంగ కారుతుంది. పండ్లు కొరుకుతూ బిగుసుకొని చనిపోతాయి. అయితే, వ్యాధి తీవ్రత ఎక్కువ అయినప్పుడు జీవాల్లో విపరీతమైన జ్వరం కనిపిస్తుంది. మేత మేయకుండా నీరసపడతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఈ వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే పశువైద్యుల సలహాతో సరైన యాంటీబయాటిక్ మందులను ఇంజక్షన్ రూపంలో గానీ, ద్రవ రూపంలో గానీ తాగించాలి. నాలుగు నెలలు పైబడిన గొర్రెలకు ఏటా వానకాలానికి ముందు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి. టీకా వేయించడానికి కనీసం 15 నుంచి 20 రోజుల ముందు నట్టల నివారణ మందులను విధిగా తాగించాలి. టీకాలు వేసిన గొర్రెలకు ఏడాదిపాటు ఈ వ్యాధి సంక్రమించదు. ఒకవేళ ఈ వ్యాధితో గొర్రెలు మృత్యువాత పడితే చాలా జాగ్రత్తగా ఖననం చేయాల్సి ఉంటుంది. ఐదు నుంచి ఆరు అడుగుల లోతు గొయ్యి తీసి, సున్నం వేసిన తర్వాత జీవాల కళేబరాలను అందులో ఉంచి మట్టితో కప్పేయాలి.

అందుబాటులో వ్యాక్సిన్



హిందూపురం డివిజన్ పశుసంవర్ధక ఉప సంచాలకుల పరిధిలో 6.34 లక్షల గొర్రెలు, 1.15 లక్షల మేకలు ఉన్నాయి. ఈ సీజన్‌లో గొర్రెలు, మేకల్లో చిటుక వ్యాధి వ్యాప్తి చెంది అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు క్షణాల వ్యవధిలోనే మృత్యువాత పడతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని చిటుక వ్యాధి నివారణకు ప్రత్యేకంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టాం. ఇప్పటి వరకూ 1.13 లక్షల డోస్‌ల వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. మరింత వ్యాక్సిన్ త్వరలో వస్తుంది. జీవాల పెంపకందారులు తమ గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ వేయించాలి.

– పెంచలయ్య, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, హిందూపురం

ఉపాధి పనుల పరిశీలన

గోరంట్ల: మండలంలోని కరావులపల్లి తండాలో చేపట్టిన ఉపాధి పనులను డ్వామా పీడీ జయేంద్రప్రసాద్ గురువారం పరిశీలించారు. పనులు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఏపీఓ వరప్రసాద్ , ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

శేషవాహనంపై శ్రీవారు



రాయదుర్గంటౌన్: స్థానిక కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం దేవేరులతో కలసి శేషవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు పెద్ద ఎత్తున జరిగాయి. సాయంత్రం కుర్నిశెట్టి సంఘం ఆధ్వర్యంలో మేళతాళాలతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను శేషవాహనంపై అధిష్టింపజేసి కోట, మొలకాల్మూరు రోడ్డు, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, బొడ్డురాయి వరకూ ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేర్చారు. శుక్రవారం హనుమద్ వాహన సేవలు ఉంటాయని ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

కాకి గ్రామంలో వైద్య శిబిరం


రోగికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

రొళ్ల: మండలంలోని కాకి గ్రామంలో అతిసార ప్రబలడంతో గత మూడు రోజులుగా దాదాపు 30 మంది తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఈ క్రమంలో చాలా మంది రొళ్ల, మడకశిర ప్రభుత్వాస్పత్రులతో పాటు కర్ణాటకలోని మధుగిరి ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ క్లినిక్‌ల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు చిదానంద, మాధుర్య, పీహెచ్‌ఎన్ సుధారాణి తదితరులు సిబ్బందితో కలసి 63 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ అస్వస్థతకు లోనైన రోగుల రక్త నమూనాలు సేకరించారు. అతిసార బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులను చైతన్య పరిచారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాకి గ్రామాన్ని పెనుకొండ డీఎల్‌పీఓ శివన్నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మల్లికార్జున, మడకశిర ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనూనాయక్ తదితరులు సందర్శించి, అతిసార ప్రబలడానికి కారణాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ లోకేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ ఏఈ విజయ్, ఈఓఆర్డీ క్రిష్ణప్ప, కార్యదర్శి రచన, సూపర్ వైజర్ ఖాదర్‌వలీ, ఆరోగ్య సిబ్బంది వాసుదేవరెడ్డి, వెంకటరామిరెడ్డి, షిరాజ్‌బేగం, జ్యోతి, ఉమ పాల్గొన్నారు.

ఆటో బోల్తా - పది మందికి గాయాలు

చిలమత్తూరు: ఆటో బోల్తాపడిన ఘటనలో పది మహిళా కార్మికులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం కోడూరు థామస్ మన్రోతోపు సమీపంలోని టెక్స్ పోర్ట్ గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తున్న పది మంది మహిళా కార్మికులు గురువారం ఉదయం విధుల్లో పాల్గొనేందుకు ఆటోలో బయలుదేరారు. నల్లరాళ్లపల్లి సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న పది మంది కార్మికులూ గాయపడ్డారు. వీరిలో అనురాధమ్మ తలకు తీవ్ర గాయమైంది. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను వెంటనే బాగేపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి చేర్చి చికిత్స అందజేయించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఘటనపై సీపీఎం నాయకులు ప్రవీణ్, రామచంద్ర మాట్లాడుతూ... గార్మెంట్స్ యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో ఆటోల్లోనే కార్మికులు ప్రయాణించాల్సి వస్తోందని, ఈ కారణంగానే తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


రాజు (ఫైల్)

పరిగి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం శిరేకోలం గ్రామానికి చెందిన వడ్డే రాజు (49) అలియాస్ రాజగోపాల్‌కు భార్య ముద్దమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తూ కుమారుడు, కుమార్తెకు పెళ్లిళ్లు చేశారు. బుధవారం సాయంత్రం పరిగి చెరువులో చేపలు పట్టేందుకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన రాజు రాత్రి అయినా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు చెరువు వద్దకెళ్లి గాలించారు. అప్పటికే చీకటి పడడంతో ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులకు చెరువు నీటిలో తేలియాడుతున్న రాజు మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీశారు. ముద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు


హోమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ తదితరులు

హిందూపురం: మండలంలోని సంతేబిదనూర్‌లో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్ ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వెండి ఆభరణాలతో అలంకరించారు. అర్చనలు, పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం ముఖమంటపంలో సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో కొలువుదీర్చి పట్టువస్త్రాలు, పూలతో అలంకరించి మేళతాళాలతో రథంపైకి చేర్చారు. రథాంగహోమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, పార్టీ హిందూపురం నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి, మండల కన్వీనర్ రాము తదితరులు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి గోవింద నామస్మరణ మధ్య రథాన్ని భక్తులు లాగారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు లలిత, నాగేంద్ర, నాయకులు వేణురెడ్డి, శ్రీరాంరెడ్డి, రామాంజి, బిసలమానేపల్లి వేణురెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏలో పుట్టపర్తి వాసి సత్తా


తల్లిదండ్రులతో శ్రీకాంత్

పుట్టపర్తి రూరల్: కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్ (సీఎంఏ)లో పుట్టపర్తి విద్యార్థి మండ్లి శ్రీకాంత్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచి వజ్ర పతకంతో పాటు మరో తొమ్మిది స్వర్ణ పతకాలు, ప్రైజ్ మనీ దక్కించుకున్నాడు. గురువారం కోల్‌కతాలోని సైన్స్ సిటీ ఆడిటోరియంలో జరిగిన నేషనల్ స్టూడెంట్ కాన్వొకేషన్‌లో పతకాలను ఐసీఎంఏఐ డైరెక్టర్ దాల్వాడీ అందజేశారు. కాగా, పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్లపల్లికి చెందిన శ్రీకాంత్ తల్లిదండ్రులు కేశవ, నాగేంద్రమ్మ దినసరి కూలీలు. ఆయన విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే సాగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఐటీసీ హోటల్ సంస్థలో గౌరవ ప్రదమైన ఉద్యోగం చేస్తూ ఆన్‌లైన్ ద్వారా 'సీఎంఏ-2023' పూర్తి చేశారు.

పుష్ప మండపంపై చెన్నకేశవుడు


పూల మంటపంపై కొలువుదీరిన ఉత్సవ మూర్తి

ధర్మవరం అర్బన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి గురువారం పుష్ప మంటపంపై ఊరేగారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వివిధ రకాల పూలతో తయారు చేసిన పుష్ప మండపంపై స్వామిని ఉదయం పురవీధులలో ఊరేగించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. ఉభయ దాతల ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు హంస వాహనంపై చెన్నకేశవస్వామి పురవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు దేవతా ఉద్వాసన నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ ఇలా..

ర్యాంకు	తేదీ
1 నుంచి 12 వేలు	27.05.2024
12,001 నుంచి 27 వేలు	28.05.2024
27,001 నుంచి 43 వేలు	29.05.2024
43001 నుంచి 59 వేలు	30.05.2024
59,001 నుంచి 75 వేలు	31.05.2024
75001 నుంచి92 వేలు	01.06.2024
92001 నుంచి 1,08,000	02.06.2024
1,08,001 నుంచి చివరి ర్యాంకు	03.06.2024

అనంతపురం: పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి, కౌన్సెలింగ్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రామకృష్ణారెడ్డి గురువారం వెల్లడించారు. ఈ నెల 27 నుంచి అనంతపురం, తాడిపత్రి, కళ్యాణదుర్గం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుంది. ర్యాంకుల వారీగా ఈ నెల 27 నుంచి జూన్ 3 వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, మే 31 నుంచి జూన్ 7వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలి. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకెళ్లాలి. అలాగే ఓసీ, బీసీ కేటగిరి వారు రూ.700, ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులు రూ.250 చొప్పున ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన ప్రాసెసింగ్ ఫీజు రసీదు, పాలిసెట్-2024 హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి మార్కుల జాబితా, 4 నుంచి పదో తరగతి వరకు స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఓసీ అభ్యర్థులు ఈడబ్ల్యూఎస్, ఆదాయ రుజువు ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు తీసుకెళ్లాలి. అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. ఎస్టీ కేటగిరి అభ్యర్థులకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది.

బంగారు గొలుసు అపహరణ

రొళ్ల: మహిళ దృష్టి ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన హులికుంట గ్రామంలో సంచలనం రేకెత్తించింది. వివరాలు... రొళ్ల మండలం హులికుంట గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గోవిందప్ప, తన భార్య లక్ష్మమ్మతో కలసి దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల వద్ద ప్రధాన రహదారి పక్కనే నివాసముంటున్నారు. వారం పది రోజులుగా ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళుతూ గోవిందప్ప ఇంటి వద్ద ఆగి నీళ్లు తాగి వెళ్లేవాడు. ఈ క్రమంలో తాను అమరాపురం ప్రాంతానికి చెందిన వాడిగా నమ్మబలికాడు. గురువారం ఇంటి ఆవరణలో లక్ష్మమ్మ పాత్రలు శుభ్రం చేస్తున్న సమయంలో వచ్చిన సదరు యువకుడు తనకు నీళ్లు కావాలని అడిగాడు. దీంతో గోవిందప్ప నీళ్లు తెచ్చిచ్చేందుకు ఇంట్లోకి వెళ్లాడు. అదే సమయంలో లక్ష్మమ్మ మెడలోని దాదాపు రూ.3.15 లక్షల విలువైన 4.5 తులాల బరువున్న బంగారు గొలుసు లాక్కొని ద్విచక్రవాహనంపై ఉడాయించాడు. మహిళ కేకలు వేసినా ఫలితం లేకపోయింది. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు, శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధనరెడ్డి దంపతులు, ఈరలక్కప్ప తదితరులు

మడకశిర: పట్టణంలో వెలసిన కోట లక్ష్మీవేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఉదయం ఆలయంలో శ్రీవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధనరెడ్డి, నందన దంపతులు, మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పతో కలసి వచ్చి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్పకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీవేంకటరమణస్వామి ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేసి వేలాది భక్తుల గోవింద నామస్మరణ మధ్య లాగారు. స్థానిక రెవెన్యూ అధికారులు సైతం శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అయ్యప్పస్వామి సేవా సమితి సభ్యులు తీర్థ ప్రసాదాలను అందించారు.